# జీవితానికో మలుపు

వీధిగేటు చప్పుడైతే రాస్తున్న కాగితాలను ప్రక్కనపెట్టి అటు చూసింది. చంకలో రెండు మూడేళ్ళ పిల్లాడితో లోనికి వస్తున్న ఆమెను చూసి ఆశ్చర్యపోయింది కళ్యాణి. విజయ తన ఇల్లు వెతుక్కుంటూ వస్తుందని తెలిసి ఉన్నా ఇంత తొందరగా వస్తుందని ఊహించి ఉండలేదు. నయమే ఆమె వచ్చేవేళకు ఆయన ఇంటిలో లేరు.

"నువ్వా! విజయా! ఏమిటిలా హఠాత్తుగా ఊడిపడ్డావు? ఒంటరిగా వచ్చావు, మీ వారిని తీసుకురాలేకపోయావా? నేను ఇక్కడ వుంటున్నానని నీకెవరు చెప్పారు?" అడిగింది కళ్యాణి సంభ్రమాశ్చర్యాలతో. ఆమె చంకలోని పిల్లడిని తీసుకుని ముద్దులాడింది. తల్లి చంక మారినవాడు ఏడుపు లంకించుకున్నాడు. కళ్యాణి వాడిని ఎత్తుకునే విజయతోపాటు లోనికివచ్చి వాడికొక బిస్కట్టు ఇచ్చి, రంగురంగుల బొమ్మలున్న ఓ పుస్తకాన్ని వాడి ముందుపడేసి వాడిని క్రిందకు దింపింది.

"ఇప్పుడు చెప్పు. నువ్వు ఈ ఊరిలో వుంటున్నావని విన్నాను. చాలా కాలానికి నిన్ను చూసే అవకాశం దొరుకుతుందని సంతోషించాను. నువ్వూ నీ భర్తా వేరే వుంటున్నారా లేక మీ అత్తమామలు మీ దగ్గరే ఉంటున్నారా?"

విజయ దేనికీ జవాబివ్వలేదు. "వాడికా పుస్తకం ఎందుకిచ్చావు? చింపి పోగులు పెడతాడు" అంది.

"అంతేకదా! బొమ్మలు. ఆట వస్తువులు కొనే భాగ్యం నాకు లేదు. మా ఇంటికి చిన్న పిల్లలెవరైనా వస్తే ఇదిగో ఓ బొమ్మలపుస్తకం వారిముందు పడేస్తాను. బొమ్మలు చూస్తారు లేదా చింపుతూ ఆనందిస్తారు. మన మాటల కంతరాయం కలిగించరు" అంది కళ్యాణి.

"ఏమిటి, ఏదో రాస్తున్నట్లున్నావు, కథా - వ్యాసమా? ఈ రచనా వ్యాసంగం ఎప్పటి నుంచి? నేను వేళకాని వేళ వచ్చి నీ కంతరాయం కలిగించానా? ఇల్లు తెలిసిందిగా మళ్ళీ వస్తాను" అంటూ లేచింది విజయ.

కళ్యాణి ఆమెను బలవంతంగా కూర్చో పెడుతూ "నిన్ను చూసి అయిదేళ్ళపైనే అయింది. ఇంటరు కాగానే నీ పెళ్ళి అయింది. నువ్వెక్కడ వుంటున్నావో నాకు తెలియలేదు. రాకరాక వచ్చావు. ఈ కథలకేం?" అంది కళ్యాణి.

విజయ గురించి తెలుసుకోవలసినవి చాలా ఉన్నాయి. కళ్యాణి అడిగిన వేటికీ ఆమె

జవాబులు చెప్పలేదు. ఆమె సంసార జీవితం సాఫీగా సాగటం లేదనే తాను వింది. అన్నీ తెలుసుకోవాలి. అవసరమైతే ఆమెను ఆదుకోవాలి. ఓర్చుస్తే తేటనీరు అంటారు. కాస్త ఓపికపడితే అన్నీ తెలుస్తాయి. ఎవరైనా అగ్నిపర్వతాన్ని గుండెల్లో ఎంతకాలం దాచుకోగలరు?

◆ ◆ ◆

"ఔనయ్యా! ఆ పోర్షను అద్దెకిస్తాం. అందుకే బోర్డు పెట్టాం. కాని ఆ గదిని నీలాంటి బ్రహ్మచారికి ఇచ్చేది లేదు" మాధవరావుగారు గట్టిగా అంటున్నారు.

తాతయ్య మితభాషి. కోపం అంటే ఏమిటో తెలియదు. ఎవరితోనూ గట్టిగా మాట్లాడరే మరి ఎందుకంత గట్టిగా అంటున్నారు అని కళ్యాణి అనుకుంది.

"తాతగారు! మీరలా అంటే ఎలా? అన్నీ తెలిసిన మీరే ఇలా సందేహిస్తే ఎలా? విద్యార్థు లందరు బుద్ధిమంతులేనని నేను చెప్పలేను. అయితే ఆ దోషాన్ని అందరికి అంటగట్టడం సబబా?"

"అంటగట్టడం కాదయ్యా. రోజూ కళ్ళతో చూస్తున్న విషయం, పేపర్లలో చదువుతున్న విషయం. నూటికి డెబ్బైఅయిదుమంది అలాంటివారే అవుతున్నారు. కీడెంచి మేలెంచమన్నారు. ఆ మరుఖాడ వారి వీధిలో ఏమైంది? చదువుకుంటున్న కుఱ్ఱాడని గది అద్దెకిస్తే ఏకుమేకై వాళ్ళకే ఎసరుపెట్టబోయాడు. నయమే, వాళ్ళు సమయానికి కళ్ళు తెరిచి అతగాడికి ఉద్వాసన చెప్పబట్టి సరిపోయింది."

నిజానికి తాతయ్యను ఆ విషయంలో ఇంతవరకు కళ్యాణి సమర్థించేది. కానైతే ఈ రోజు మాత్రం ఎందుకో భిన్నాభిప్రాయం ఏర్పడింది.

ఆ కుఱ్ఱాడు దీనంగా గది ఇవ్వమని వేడుకుంటున్నాడు. తాతయ్య నీకిచ్చేది లేదు అని మొండిగా అంటున్నాడు. మరొక వ్యక్తి అయితే ఈ పాటికి తిరిగి వెళ్ళిపోయేవాడు. పాపం ఆ కుఱ్ఱాడు ఎంత ఆశపడి వచ్చాడో? ఆ మాత్రం జ్ఞానం తాతయ్యకు ఉండాలా వద్దా?

తమ ఊళ్ళలో కాలేజీలు లేకుంటే ఎవరైనా పై ఊర్లకు పోవలసిందేగా? విజయ అన్నయ్య పై చోట వుండేగా చదువు పూర్తిచేశాడు. రేపు తన తమ్ముడికి కోరుకున్న కోర్సులో సీటు వస్తే పైవూరని ఉపేక్షించి చదువు మానేస్తాడా?

"ఎలా చెప్తే నీకు అర్థం అవుతుంది. ఆ పోర్షను ఒక చిన్న కుటుంబానికైతేనే ఇస్తాం."

కళ్యాణికి తాతయ్య ప్రవర్తన నచ్చలేదు. మరి ఉండలేక అక్కడికొచ్చి "తాతయ్యా! మరోమారు ఆలోచించు" అంది.

"తాతయ్యగారు! మా కాలేజీని కొత్త బిల్డింగుకి మార్చారు. ఇంకా రెండు సంవత్సరాల చదువుంది. ఇక్కడైతే సదుపాయంగా ఉంటుంది. సిటీబస్సుల గొడవవుండదు. పైగా ఈ కాలనీలో మర్యాదస్తులే వుంటున్నారు."

"నన్ను ఎందుకు విసిగిస్తావు. నువ్వు ఇంజనీరింగు చదువుతున్నా నీకు గది అద్దెకు ఇవ్వలేం" అన్నాడు మాధవరావు.

"ఏమండీ! మా తాతయ్య మాటలకేం మీరు మంచిరోజు చూసుకుని రండి. ఇంటి అద్దె ఐదువందలు. ఒక నెల అద్దె అడ్వాన్సుగా ఇవ్వాలి. ఏ కారణంగానైనా మాకు ఆ పోర్షను అవసరమైనా, మీ వలన మాకు కాని ఈ చుట్టు పక్కలవారికి కాని ఇబ్బంది కలిగినా మీరు తక్షణం ఇల్లు ఖాళీచేయాలి" అంది కళ్యాణి.

మాధవరావు మనుమరాలివంక కోపంగా చూసి వెళ్ళిపోయాడు. అతను అద్దె డబ్బులు తీసి ఇచ్చాడు. కళ్యాణి ఆ డబ్బులు పుచ్చుకోలేదు. "మీరు రేపో ఎల్లుండో ఇంట్లో దిగుతారుగా. అప్పుడు తాతయ్యకే ఇవ్వండి" అంది కళ్యాణి.

"ఆ కుఱ్ఱాడు మీ మేనత్త కొడుకా? మీ మేనమామకు దత్తుపుత్రుడా? చుట్టమా, పక్కమా? పోనీ ముఖపరిచయం ఉన్నవాడా?" అడిగాడు మాధవరావు కళ్యాణిని.

"నిజమే తాతయ్యా! ముక్కు మొహం తెలియనివాడే. అతడు మంచివాడు కాదని ఎందుకు అనుకోవాలి?" అంది.

"........"

"అతనికి ఎవరూ ఉండడానికి బస ఇవ్వక పోతే చదువేం కావాలి?" అంది నేలవేపు చూస్తూ కళ్యాణి.

"ఏమోనమ్మా! ఎదిగిన పిల్లవు ఉన్నావు. ఖర్మకాలి ఏదైనా అయితే అప్పుడు అప్పుడు విచారించి ప్రయోజనం ఉండదు."

"తాతయ్యా! ఆ అబ్బాయి మాటకేం నామీద మీకు నమ్మకంలేదా?"

పరిస్థితులు మరోవిధంగా మలుపు తిరుగుతాయని వాళ్ళెవరు ఆనాడు ఊహించలేదు.

◆ ◆ ◆

"మొత్తానికి నువ్వు మీ తాతయ్యమీద విజయం సాధించావు. ఆ తరువాత అతడ్ని తీరిగ్గా ప్రేమించావు. పెళ్ళి చేసుకున్నావు. ఇంకేం 'కళ్యాణస్మృతులు' అన్న శీర్షిక పెట్టి ఏ పత్రికకో పంపించు" అంది విజయ.

కళ్యాణి విజయకు ఉప్మా ప్లేటు అందించింది.

"చిత్రమే మరి! ఏవేవో ఆశయాలను, లక్ష్యాలను పమిటికొంగుతో ముడివేసుకుని ఎకనమిక్సు చివరి సంవత్సరం చదువుతున్న రోజులవి. ఆ ఆశయాలను, లక్ష్యాలను ఒక్కొక్కటిగా విజయవంతంగా ఆచరించేసి, ఉన్నత స్థానాన్ని చేరుకుని, ఆ తరువాత జీవితాన్ని సప్తవర్ణాల

ఇంద్రధనుస్సుగా మలచుకోవాలని ఉబలాటపడుతున్న రోజులవి. ఔను, అప్పుడు నాకు జీవితపు తాకిడి తెలియదు. ఆర్థిక సూత్రాల ప్రకారం జీవితాన్ని సిద్ధాంతీకరించుకుని, దానికి అనుగుణంగా వేసుకున్న ప్రణాళికల సహాయంతో, జీవితంలో ఏవైపుకు కావాలనుకుంటే ఆ వైపుకు నా పుష్పకవిమానాన్ని తిప్పుకోగలనని భావించేదాన్ని."

"అలాగా! అయితే తమరు ఆ ప్రయత్నంలో సఫలురయ్యారా?'. అంది నవ్వుతూ విజయ.

కళ్యాణి వివాహం ప్రకాశరావుతోనే జరిగి ఉంటుందని ఆమెకు పూర్తి నమ్మకం ఉంది.

"విజయా! మనం హైస్కూల్లో చదివే రోజుల్లో కృష్ణమూర్తిగారనే ఇంగ్లీషు మేస్టారు ఉండేవారు గుర్తుందా?" అంది కళ్యాణి.

"గుర్తులేకేం? అతని భార్య కామేశ్వరమ్మ గార్కి నీవు దత్త పుత్రికవు. నీ వంటే తెగని అభిమానం చూపేవారు."

"ఔనా! ఆ విషయమే చెప్పాలనుకున్నాను ఫరవాలేదు. నువ్వు నా దారిలోనే నడుస్తున్నావు. 'ఏమండీ! మీ శిష్యురాలు కళ్యాణికి మోస్ట్ అప్టుడేట్, మోస్ట్ ఎడ్యుకేటెడ్, మోస్ట్ రివల్యూషనిస్ట్ అయిన కుఱ్ఱాడిని వెతికి పెండ్లి చేయించండి' అనే వారామె."

"ఇంకేం! ఆవిడ అభిలషించే లాంటి వ్యక్తిని నువ్వే మీ ఇంటికి రప్పించుకున్నావు. మరి కామేశ్వరమ్మగారు మీ వివాహానికొచ్చారా?"

"విజయా నన్ను చెప్పనీయ్. ఆ రోజుల్లో నా ఆలోచనలు చాలా ఉగ్రంగా వుండేవి. స్త్రీ పురుషులపట్ల భేదభావం చూపే వివాహవ్యవస్థమీద నాకు అభ్యంతరం ఉండేది. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులే. అందువలన భార్యాభర్తలు ఒకరికొకరు పూరకాలు కావాలి. ఒకరు అధికులు వేరొకరు అల్పులుగా పరిగణించబడకూడదు. స్త్రీ కూడా పురుషుడంతగా చదువుకుంటున్నాది, ఉద్యోగం చేసి ధనార్జన చేస్తున్నాది. మరి ఆడపిల్ల తరపువాళ్ళు కట్నం ఎందుకు ఇవ్వాలి? స్త్రీని అణగత్రొక్కడం, పురుషునిదే పైచేయి అనడం ఎక్కడి న్యాయం?"

"కళ్యాణీ! నీవు చెప్పినది నాకేది కొరుకుడు పడటంలేదు."

"కామేశ్వరమ్మగారు నాతో ఏకీభవించేవారు కారు. కళ్యాణీ నీవి గొంతెమ్మ కోర్కెలు. సంసారం అనే శకటానికి భార్యాభర్తలు రెండు చక్రాలలాంటివారు. అయితే ప్రకృతి స్త్రీని అబలగానే సృష్టించింది. అందుకే ఆమెకు ఓర్పు, క్షమ, వాత్సల్యం, భక్తి, సేవాభావం వంటి కొన్ని ధర్మాలను ప్రసాదించింది. చదువుకున్నానని ఉద్యోగాలు చేయడం స్త్రీ ధర్మం కాదు. అది విదేశీయులు మన సంస్కృతిని ధర్మాన్ని దెబ్బతీయడానికి వేసిన ఎత్తు. సంసారమా, సంపాదనా ఏది స్త్రీకి ముఖ్యం అంటే హిందూ స్త్రీ యుగయుగాలుగా మొదటిదాన్నే కోరుకుంటుంది. ఇక కట్నం అనేది ఒక వేడుక. అయితే అది వ్యాపారం కావడం మన దుర్భాగ్యం. అవతలివారు కట్నం కోరుతున్నారని

మంచిసంబంధాలను తిరస్కరిస్తే స్త్రీ జీవితంలో షడ్రుచులను చవిచూడలేదు. స్త్రీల మనస్తత్వంలో మార్పు వచ్చేవరకు స్త్రీ ఈ విషయంలో రాజీపడాలనేవారు ఆమె" అంది కళ్యాణి.

ఇంతలో విజయ కొడుకు ఏడుపు మొదలెట్టాడు. "వాడికి ఆకలిగా ఉందేమో పాలుతెస్తాను" అంటూ లేచింది కళ్యాణి.

◆ ◆ ◆

ప్రకాశరావుగారికి ఇల్లు అద్దెకిచ్చినందుకు మేమెవరం బాధపడవలసిన అవసరం కలుగలేదు. అతనిది మృదువైన స్వభావం. ఒకరి జోలికి శొంఠికి వెళ్ళేవాడు కాదు. మా వాళ్ళు పెట్టిన నిబంధనలు అన్నీ పాటించేవాడు. రాత్రి తొమ్మిదిలోగానే గదికి వచ్చేవాడు. అమ్మకు ప్రకాశరావు బాగా నచ్చేడు. ఆమె తన భర్తతో ఆ విషయం చెప్పి తొందరగా ప్రకాశరావు తండ్రిగారింటికి వెళ్ళి సంబంధం సెటిల్ చేసుకురమ్మనేది.

రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. ఇంకా ప్రకాశరావుగారు వుండేది రెండు మూడురోజులే అని తెలియగానే కళ్యాణి ఆరాటపడసాగింది. అంతవరకు ఆమె ప్రకాశరావుకి ఎదురుపడలేదు.

తన మనసు ఎందుకు ఆరాటపడుతోంది? కళ్యాణి మనసులో ఈ ప్రశ్న పదే పదే తలెత్తసాగింది. కాని జవాబు తట్టేది కాదు.

◆ ◆ ◆

కళ్యాణి గ్లాసులో పాలు తెచ్చి విజయ కొడుక్కి ఇచ్చింది.

"కల్యాణీ! ఎవరినైనా మభ్యపెట్టగలం. కాని మన మనసును మనం మభ్యపెట్టలేం" అంది విజయ.

"ఏమిటి?"

"అబ్బే! నీవు రాస్తున్న కథ విషయం చెప్తున్నాను. కథలోని పాత్ర కళ్యాణి మనసు ఆరాటపడటం సహజమే. ఆమె అప్పటికే ప్రకాశరావుని ప్రేమిస్తోంది, ఆరాధిస్తోంది. అంతేనా?'. అంది విజయ.

"విజయా! ఒక్క మెతుకు ముట్టుకుంటే అన్నం ఉడికిందో లేదో తెలుస్తుంది. కాని నాలుగు పేజీలు చదువుతే కథ తెలిసిపోయిందనుకోకు" అంది కళ్యాణి.

..................

"ఈ కుళాయిలకొక వేళాపాళా ఉండదు. ఉండు బిందె పెట్టి వస్తాను" అంటూ కళ్యాణి లేచింది.

◆ ◆ ◆

"మీరు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే ఆ కుఱ్ఱాడిని ఎవరైనా గెద్దలా తన్నుకుపోతారు.

అతడి పరీక్షలయ్యాయి. నేడు రేపో వెళ్ళిపోతాడట. అతనికంటే ముందు మీరే వాళ్ళ ఇంటికి వెళ్లండి." కళ్యాణి తల్లి బలవంతం చేస్తే కళ్యాణి తండ్రి ప్రకాశరావు తండ్రిని కలియడానికి వాళ్ళ ఊరు వెళ్ళాడు.

ఆ రోజు పొద్దుపోతున్న సమయంలో కళ్యాణి తమ్ముడు ఇంటికి వస్తూనే "అక్కయ్యా! ప్రకాశరావుగారు వీధిమెట్లమీద పడిపోయారు" అన్నాడు.

ఆ సమయంలో కళ్యాణితల్లి ఇంట్లో లేదు. ఆమె తాతగారు షికారు కెళ్ళారు. ఒంటరిగా వుంది ఆమె.

అతనికి ఏమైంది? కళ్యాణికి చెప్పలేనంత భయంకలిగింది, మనసులో కలత రేగింది. సమయానికి పెద్దవాళ్ళు ఎవరూ లేరు.

ఎందుకీ మనోవ్యాకులత? అతనికీ తనకు ఏమిటి సంబంధం? ఇది స్త్రీ హృదయానికి సహజమార్దవ ప్రభావమా? లేక....?

ఏమిటీ పాడు ఆలోచనలు.

తోటి మనిషి ఒకడు తన ఆత్మీయులు, బంధువులు చెంతలేనప్పుడు జ్వరమో ఏదో వచ్చి బాధపడుతూ ఉంటే వెళ్ళి సహాయం చేయడానికి ఇన్ని ఆలోచనలెందుకు? స్త్రీ అయినా పురుషుడైనా, తెలిసినవాడైనా, తెలియనివాడైనా అలాంటి విపత్తులో వుంటే ఆదుకోవడం స్త్రీకి అయినా పురుషునికైనా ప్రథమ కర్తవ్యం. కళ్యాణి వెంటనే అతని గదికి వెళ్ళింది. అతను అస్తవ్యస్తంగా మంచం మీద పడి వున్నాడు. బూట్లనైనా విప్పుకోలేదు. ఒంటిమీద చేయివేసి చూసింది. శరీరం పెనంలా కాలిపోతోంది. జ్వర ఉపశమనానికి మందు తెచ్చి త్రాగించింది. బూట్లు విప్పింది.

ఆ స్పర్శకు లేచిన ప్రకాశరావు "మీరా!" అంటూ లేవబోయాడు. అతడ్ని వారించింది.

"నేను డాక్టరుకి ఫోను చేసాను. అతను వస్తూ ఉంటారు" అంది కళ్యాణి.

నిద్రలేమివలన బడలికవలన వచ్చిన జ్వరం, మూడురోజుల్లో తగ్గిపోతుందని డాక్టరు చెప్పి కొనవలసిన మందుల చీటీ రాసి ఇచ్చాడు.

కళ్యాణి తల్లి వచ్చిన తరువాత ప్రకాశరావుని చూసి "బాబూ! నీకు బాగు అయ్యేంతవరకు కాఫీ, టిఫిన్లకు భోజనానికి బయటకు పోకు. నేనే ఏర్పాటు చేస్తాను" అంది.

మరునాడు కళ్యాణి తండ్రి తిరిగి వచ్చాడు.

"పరమేశ్వరీ! నువ్వతని మీద ఆశలు పెట్టుకోకు. ప్రకాశరావుకి మేనరికం ఉంది. ఆ మేనమామే ఇతడ్ని చదివిస్తున్నాడు" అంటూ వివరంగా అన్ని విషయాలు చెప్పాడు కళ్యాణి

తండ్రి.

కళ్యాణికి ఆ విషయాలు బాధను కలిగించాయి.

◆ ◆ ◆

"ఏమిటి కళ్యాణీ! కథను ఇలా మలుపు తిప్పావు? మరి ఇలా జరగబోతుందంటే ఇన్ని పేజీలు దండుగ చేసావెందుకు?" అంది విషాదంగా విజయ.

"విజయా! జీవితానికి కథకు ఉన్న భేదం అదే. కథనైతే మనం ఎలా కావాలంటే అలా తిప్పగలం. కాని జీవితానికి మలుపులు ప్రకృతి సిద్ధమైనవి. ఆ తరువాత ఏం జరిగిందన్న ఉత్కంఠ నీకు వుంటుంది. నేను రాసింది ఇంతవరకే. పోనీ నీవు చెప్పినట్లు కళ్యాణి ప్రకాశరావుని చేసుకుంది అని ముగింపు ఇవ్వనా?"

"ఛ.... ఛ.... నా అభిప్రాయం అది కాదు."

"విజయా చిత్రంగా ఇక్కడ కథ మరో మలుపు తిరిగింది. వారం రోజులు పోయిన తరువాత ప్రకాశరావుగారి తండ్రిగారు మా ఇంటికి వచ్చి తన కొడుకు కళ్యాణినే పెళ్ళాడతానని భీష్మించుకు కూర్చున్నాడు. మీరు మీ పిల్లను వాడికివ్వడానికి సుముఖంగానే వున్నారు. ఇప్పుడు మీ అభిప్రాయం చెప్పండి" అని అడిగారు.

"మీవాళ్ళేం అన్నారు?"

మా అమ్మ సంతోషించింది. మా నాన్నకు ఏ అభ్యంతరంలేదు.

"కాని నేను మరో విషయం చెప్పాలి. "ప్రకాశరావు మేనమామ, అంటే నా బావ రెండులక్షలవరకు వీడి చదువుకోసం ఖర్చుపెట్టాడు. అది వాళ్ళకు తిరిగి ఇవ్వాలి. నా సమస్య మీకర్థమైందిగా?" అన్నాడు ప్రకాశరావు తండ్రి".

"బాగుంది. కట్నం కోరేవాడిని చేసుకోకూడదని నీవు అనుకునేదానివిగా?"

"లేదు. కామేశ్వరమ్మగారి సలహామేరకు నేను అలాంటి ఉద్దేశ్యాన్ని విరమించుకున్నాను. అయితే నా కోసం మరో ఆడపిల్లకు అన్యాయం చేసేవాడినినేను ఎలా చేసుకోను? నా అభిప్రాయాన్ని చెప్పాను."

"అంటే ఆ సంబంధం తెగిపోయింది. దానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?"

"విజయా! జీవితంలో కోరుకున్నవి అన్నీ లభించవు. ఆ తరువాత మా వాళ్ళు మరొకడితో నా పెళ్ళి జరిపించి తమ బరువు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అమ్మాయి అక్కడ సుఖపడుతున్నాదా లేదా అని వారు పట్టించుకోలేదు. అతను నన్ను కట్నం కోసం పెళ్ళాడాడు. ఆ తరువాత పండుగ వచ్చినా పబ్బం వచ్చినా అత్తవారింటినుంచి ఏదో రాబట్టాలని చూసేవాడు.